# బడుగులు మేల్కొనేదెప్పుడో!



చుట్టూ పచ్చటి అడవి. దగ్గరగా కనిపిస్తూ నడుస్తున్న కొలందీ దూరమై పోతున్న సవరవలస నా గమ్యం. సవర వలస తారురోడ్డును కలిపే ఎఱ్ఱమట్టి రోడ్డు నాతో వస్తుంది తోడుగా గమ్యం వైపు. అడుగేస్తే అంగుళం దిగబడి, ఎఱ్ఱటిదూలిని రేపుతూ అటవీ సంపదను పట్నం తరిలించడంతో బాగా నలిగి పోయినట్టుంది. సవరవలస పొలిమేరలో నాకు వీడ్కోలు చెప్పి అడవిలోపలకు పోయింది. మట్టి రోడ్డు. పాకలు మసి బారి, గోడలు అక్కడక్కడ పెచ్చు లూడి వెదురుకఱ్ఱలు కన్పిస్తున్నా ఎండా, వానా పాకల్లోకి చొరనంత దిట్టంగా వేసుకుంటారు సవర్లు. సవర్లు కష్టజీవులనడానికి నిదర్శనం, పనిచేయగల ఓపికున్న వాళ్ళెవ్వరూ పగలు వలసలో కనిపించరు. సంవత్సరం క్రితం మేనేజరుకి వెయ్యిరూపాయలు ముడుపు చెల్లించి, సవరవలస మేనేజ్‌మెంట్ స్కూల్లో టీచరుగా అడుగుపెట్టిననాటి ఊరి స్వరూపం పూర్తిగా మారిపోయిందిప్పుడు.

పూరిపాకల స్థానే ప్రభుత్వం కట్టి ఇచ్చిన కాలనీ వెలసింది. సంవత్సరం తిరక్కుండానే కాలనీ పైకప్పులు అక్కడక్కడ రెల్లుగడ్డి కప్పుకొని, పెచ్చులూడిన గచ్చులు పేడా, మన్ను

పులుముకొని అటు ఆధునిక మానవుని సంస్కృతిని, ఇటు ఆదిమానవుని సంస్కృతిని గుర్తుచేస్తున్నాయి.

వచ్చే నెల 11వ, తేదీన మినిష్టరు గారు వెనుకబడిన ప్రాంతాన్ని పర్యటించడానికి వస్తారు అన్న సంగతి, ఈ మధ్య తరచూ వలసలో కనిపించే ఎ. ఎన్. ఎమ్. లు, గ్రామసేవికల వల్ల తెలుసుకుంటున్నారు సవర్లు.

గ్రామసేవికల కృషి ఫలితంగా, సవరకన్యలు నాగరికుల మధ్యకు వచ్చేటపుడు, చాలవిగుడ్డల్లో, దాగని తమ గుండెల్ని, గుడ్లగూబల్లా చూచే అనాగరికపు చూపుల్ని తప్పించుకోవడానికి రవికెలు వాడుతున్నారు. మినిష్టరుగారు పర్యటించే రోజునైనా సవర్లచేత మంచి బట్టలు కట్టించాలని, పంచె కట్టడం ఎలాగో నేర్పుతున్నారు. లేకపోతే వీళ్ళ అవతారాలు చూచి, వీళ్లకేమీ చేయడంలేదని అనుకుంటారు అని భయం. మగవాళ్ళు మాత్రం పదిమూర్ల పంచెని సహితం పదిసార్లు నడుము చుట్టూ చుట్టి గోచీయే కడుతున్నారు. గ్రామసేవికలు ముసి ముసి నవ్వులు నవ్వుతూ ఇదేమని అడిగితే వంటినిండా బట్ట కట్టుకున్నా మీలో కనిపించే ఎనవ చూపులు మాలో మచ్చుకైనా కనిపించవు కదా? అని అర్థం వచ్చేటట్టు "ఇలగుంతె మల్లేటయ్యింది?" అని విసుక్కుంటున్నారు. "కాలమొయ్యి పంచికత్తి, కొండకెత్తై కొయ్యి తగిలి బట్టసిరికై పోద్ది. ఇలగుంతేనే మాకు బాగు." అంటూ తప్పించుకుంటున్నారు. సవర్లకు - ఆధునిక నాగరికత, ఆరోగ్య సూత్రాలు నేర్పడానికొచ్చే పభుత్వోద్యోగులు ఎనభై సంవత్సరాల ముసలి వాళ్ళను సహితం "ఒరే లాటిగా!, ఒరే ఖెన్నిగా!," అంటూ పేర్లు పెట్టే పిలుస్తారు "మీరు ఒరే, ఒరే! అని సంభోదిస్తున్నా బాబు, అమ్మా అనే గౌరవిస్తున్నారు మా సవర్లు. అలాంటప్పుడు ఎవరు ఎవరిదగ్గర నేర్చుకోవాలి నాగరికత? కొండకెళ్లినా, సంతకెళ్లినా ఒకరి వెనుకొకరు 'క్యూ' పద్ధతిలో వెళ్లిరావడమే మా సవర్ల క్రమశిక్షణ. తప్పకుండా ఈ పద్ధతిని ఆచరించవలసిన స్థలాల్లో సహితం మీలో చాలా మంది ఆచరించడం లేదు. మరెందులో మీరు నాగరికులు. మీకు తెలిసిన నాగరికత ఏమిటి?

ఆర్థికంగా ముందంజ వెయ్యడమే కొందరి దృష్టిలో నాగరికత అయితే మనదేశమే అనాగరిక దేశం. ఆర్థికంగా, పారిశ్రామికంగా మన కంటె ముందున్న కొన్ని దేశాల దృష్టిలో. కాదంటారా? మరి? ఓహో! మనిషిని మనిషిగా గుర్తించి, గౌరవించడమే నాగరికత అంటారా? అయితే హరిజనులే కారా మనుషులు, మా సవర్లం కామా మనుషులం? మరెందుకు మమ్మల్ని ఒరే, ఒరే అంటూ పిలుస్తున్నారు. అందుకే మా

దృష్టిలో మీరే అనాగరికులు" అంటూ దులిపేశా డొకరోజు చిన్నపుదొర. చిన్నపుదొర సవరవలస కులపెద్దగా రబ్బాయి. బి. ఏ. చదువుకున్నాడు. ఈ మధ్యనే అతన్ని పోలీసులు పట్టుకెళ్లారు. నక్సలైట్లతో తిర్గుతున్నాడనే అనుమానంమీద. చిన్నపుదొర వెళ్తూ వెళ్తూ "మాష్టారూ! కొంచెం వలసవి కనిపెడుతూ ఉండ"మని చెప్పిపోయారు. ఆలోచిస్తూ కూర్చున్న నాకు వేళ తెలియలేదు. కొండ సూర్యుణ్ణి తన వెనుక దాచి, సవరవలస మీద తన నీడను పరచింది. బడి వదిలే వేళైపోయిందని గ్రహించిన విద్యార్థులు గంట కొట్టడానికి ఘర్షణపడుతున్నారు.

ఎంకటిదొర అనే విద్యార్థిని గంట కొట్టమని చెప్పి, వచ్చి బయట నిలబడ్డాను. బడిగంట కొండరాళ్ళలో మారుమ్రోగింది. ఒకరివెనుకొకరు నడిచి వెళ్ళే వారి క్రమశిక్షణ, కొండకైనా సంతకైనా నడిచి వెళ్ళివచ్చే వాళ్ళ తల్లి తండ్రులను చూచి నేర్చుకొన్నదే. చెయ్యి నొప్పిపెట్టేవరకూ గంటకొట్టి, గంటకొట్టడానికి సరదాపడే ఇంకో విద్యార్థికి ఇనుపముక్క నందించాడు ఎంకటిదొర. ఇంతలో ఎర్రటి ధూళిని రేపుకుంటూ వస్తున్న సమితి జీపును చూచి అలాగే నిలబడిపోయాను. బడి ముందుకు వచ్చి ఆగింది సమితిజీపు. అందులోనుంచి దిగిన ఆఫీసర్లకు ఉమ్మడిగా, వేరువేరుగా నమస్కారాలు చేసి, బడిలో ఉన్న కుర్చీలను, డ్రైవర్ సహాయంతో బయట వేసి, మర్యాద చేశాను, దూరంగా చేతులు కట్టుకు నిలబడుతూ. ఇంతలో జీపు వెనుకవైపునుంచి దిగిన ఇద్దరు శాల్తీ, నా దగ్గరకు వచ్చి, తనపేరు అప్పారావని పరిచయం చేసుకున్నాడు.

"మేష్టారూ కనీసం బి.డి.ఓ., గారికి, ప్రెసిడెంటుగారికి కాఫీలు ఏర్పాటు చేయడానికి అవకాశముంటుందా?" అని అడిగాడు.

"వలసలో పాలు దొరకవండి. వారు తాగేటట్టయితే హార్లిక్స్ నీళ్ళతో కలిపి ఏర్పాటుచేయగలను." "ఒట్టినే దొరికితే ఎండ్రిన్ అయినా తాగేస్తారు. ఫరవాలేదు కలిపి పట్టుకురండి." అని ఆర్డర్ జారీచేశాడు. వలసలోనే నా కోసం సవరలు కట్టిన పాకలో ఇంత ఉడకేసుకుంటున్నాను కాబట్టి, వేడినీళ్లు మరగబెట్టి, హార్లిక్స్ కలిపాను. వట్టి హార్లిక్స్ ఇవ్వడం బాగోదేమోనని చెప్పి, రాత్రికి నాకోసం ఉంచుకున్న రెండు కోడిగుడ్లు ఆమ్లెట్ చేశాను.

ఇంతలో అప్పారావుగారు వలసలోని సవర్లందర్నీ కూడదీసి, బడిముందు కూర్చోబెట్టి "ఒరే, మీ సవర్లందరికీ ఎడ్లు, పోతులు కొనుక్కోడానికి ప్రభుత్వం డబ్బు శాంక్షన్ చేసింది. ఇప్పుడు బి.డి.ఓ.గారు మీ అందరికీ డబ్బు పంచుతారు. ఒక్కొక్కళ్లు

వచ్చి డబ్బు తీసుకొని బక్కాలు కొనుక్కోండి." అని చెప్పాడు.

పోతులుగాని ఎడ్లుగాని ఉన్నవాళ్ళను చేతులెత్తమన్నాడు. ఎత్తినవాళ్ళను ఎత్తినక్షే లేచి నుల్చోమన్నాడు. వాళ్ళపేర్లు నాచేత రాయించి, మనిషికి 250 రూపాయలు చొప్పున ఇచ్చి 450 రూపాయిలు అందినట్టు వేలిముద్దర్లే యించుకున్నారు. ఎడ్లు, పోతులు లేని సవర్లకు 400 రూపాయలు చొప్పున పంచి, కంట్లో దుమ్ముకొడుతూ వెళ్ళిపోయింది సమితి జీపు. బక్కాలు ఉన్నాయని నిజం చెప్పి నందుకు బాధపడుతున్నారు సవర్లు. బక్కాలు లేవని అబద్ధంచెప్పి, ఆఫీసర్లను మోసం చెయ్యాలన్న చెడుతలంపును వాళ్ళలో రేపి పోయారు ఆఫీసర్లు.

మరునాడు కోళ్ళు కూయకమునుపే బక్కాలు కొనుక్కోడానికి బయలుదేరుతున్న సవర్లకు దర్శనమిచ్చాడు బ్రోకరప్పారావుగారు. "ఒరే బి.డి.ఓ.గారు నన్ను దగ్గరుండి మీకు బక్కాలు కొని ఇమ్మన్నారు." అని చెప్పాడు. "సంతలో జోబుదొంగలుంటారు కొబట్టి డబ్బు మీ దగ్గరుంచే పోయే అవకాశముం"దని చెప్పి, వాళ్ళవద్ద డబ్బు వసూలు చేసి, తన బ్యాగ్‌లో జాగ్రత్తచేసి వాళ్ళను సంతకు తోలుకెళ్ళాడు.

బడిలో కూర్చున్న పిల్లలకు పలకల మీద, పుస్తకాల మీద దృష్టిలేదు. మాటి మాటికీ ఎర్రమట్టి రోడ్డువైపే చూస్తున్నారు, వాళ్ళ, తండ్రులు సంతనుంచి తెచ్చే మిఠాయికోసం.

బ్రోకరప్పారావుగారు సంతలో వాళ్ళకు సారా పోయించి, ముసిలీ, ముతకా బక్కాలు కొనిచ్చారు. సవర్లు పాపం ఇదేమని అడగకపోయినా, వాళ్ళ ముఖాల్లో భావాన్ని చదవగలిగిన బ్రోకరప్పారావు "ఒరే, ఇవి మీకు ఒట్టినిచ్చినవే. వీటిని మీరు మినిష్టరుగారికి చూపించిన తరువాత కొట్టుకు తినేసినా అడిగేవాడుండని" చెప్పి, దార్లో కనీసం టీ తాగడానికి చిల్లరడబ్బులు కూడా యివ్వలేదన్న సంగతి పట్టి చేతులతో సంతనుంచి తిరిగొచ్చినవాళ్ళ తండ్రుల రాకతో కూడా తెలియలేదు వాళ్ళకు. కొత్త పోతులమీద ఎక్కి స్వారీ చేయ్యడంలో మిఠాయి సంగతి, బడిగంట సంగతి కూడా మరిచిపోయారు వాళ్ళు. పడమటికొండ సూర్యుణ్ణి తన వెనుక దాచి సవరపల్లెమీద తన నీడను పరిచింది. క్రమంగా పచ్చటి ప్రకృతి నల్లబారింది. పగలంతా పడ్డ శ్రమకు సవర్లు ఆశించే తగిన ఫలం నిద్ర మాత్రమే. ఎదుగూ, బొదుగూ లేని సవర్ల జీవితాల్లా రోజులు దొర్లిపోతున్నాయి. "రేపే మినిష్టరుగారొచ్చేది" అని గుర్తుచేసి, "సవర్లందర్నీ బక్కాలతో వహా పట్నం తీసుకువచ్చే బాధ్యతను, స్వయంగా బి. డి. ఓ గారు మీకు ఒప్పజెప్పారు" అని చెప్పి వెళ్ళాడో రోజు

ట్రోకరప్పారావు. తెల్లవారింది. పిల్లలకు సెలవు ప్రకటించి, సవర్లతో సహా పట్నం చేరుకున్నాను, దగ్గరదారిన మూడుమైళ్ళు నడచి.

పట్నం పెళ్ళికొడుకులా తయారయ్యింది. రోడ్డుమీద మనుషులను, కుక్కలను తిరగనివ్వడం లేదు పోలీసులు. కొన్ని వేల రూపాయలు ఖర్చుపెట్టి వేదిక తయారుచేశారు. కొన్ని వేలమంది ఎదురు చూస్తున్నారు మినిష్టరు గారి అమూల్యమైన మాటలను మూట కట్టుకోడానికి. అంతలో వరసగా వచ్చి ఆగిన కార్లనుంచి దిగిన ఇద్దరుశాస్త్రీలు, టెర్లిన్ ప్యాంట్లు, కాకీ జుకలు, బిళ్ళ బంట్రోతులు పుట్టలనుంచి బయటపడ్డ చీమల్లా కార్లలోనుంచి బయటపడ్డారు. అంతా గందరగోళంగా వుంది. ఫోటో గ్రాఫర్లు కూర్చొని, నుల్చొని, ఒంగొని తెగ అవస్థపడిపోతున్నారు ఫొటోల కోసం. చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చిన సవర్లు వరసగా నిలబడ్డారు వారి కిచ్చిన పోతుల కెదురుగా, క్రమశిక్షణను గుర్తుచేస్తున్నట్టుగా ఎండలో.

గిరిజన కార్పొరేషన్ గోడౌన్ గేటుకి కట్టిన రిబ్బను కత్తిరించి, మాట్లాడడానికి సమయంలేదని లేదని చెప్పి, కార్లు ఎక్కాయి ఇద్దరు శాస్త్రీలు.

"ఎర్రిచేపల్లాగ ఎండనబడి నడసు కెలిపొచ్చినామ్, పందండేస్" అంటూ కదిలారు ప్రజలు. ఇంకా మినిష్టరు గారిని చూడడానికి వస్తున్న ప్రజల నుద్దేశించి "ఇంకేటుందక్కడ సూడ్డానికి? సవరోలికిచ్చిన బక్కలు కట్టేసున్నాయి. మీరెల్లీ సరికి ఆలూ తోలుకుపోతారు.... బేగెల్లండి," అంటూ హాస్యమాడుతున్నారు. ఉసూరుమంటూ బక్కలను తోలుకుపోతున్న సవరలను అనుసరించాను మౌనంగా.

"గురువా! మినిష్టరు ఎందుకొచ్చినాడు?"

"కొత్తగా గోదాంలు కట్టారు కదా, వాటిని చూచి ప్రారంభోత్సవం చేయడానికొచ్చారు. ఆ గోదాములు మీకోసం కట్టినవే. మీరు పండించిన పసుపు, అల్లం, చింతపండు ఇకనుంచి మీరు ఇక్కడే అమ్మాలి." వ్యాపారం పేరుతో సవర్ల వద్ద సరుకుల్ని దోచుకువెళ్ళే సావుకార్ల బారినుండి సవర్లను రక్షించడానికి ప్రభుత్వం సదుద్దేశ్యంతో కట్టిన గోదాముల్లో "ఇకమీదనుంచి మీవద్ద సరకులకు గవర్నమెంటు రేటు ప్రకారం ధర చెల్లించి కొంటారు," అని చెప్పాను వాళ్ళకు.

"అవును గురువా...నువ్వు సెప్పినట్టె సెప్పాడు సంగపోడు మల్ల."

ఈ మధ్య తరచూ కాగడా వెలుగుతూనే ఉంది సవరవలసలో. చుట్టుపట్ల గ్రామాలతో సహితం రాత్రులు మీటింగులు పెడుతున్నారు నక్సలైట్లు. గ్రామాల్లో పనిచేసే టీచర్లు కొంతమంది

అటు పోలీసులకు, ఇటు నక్సలైట్లకు ఏజంట్లుగా పనిచేస్తున్నారు. నక్సలైట్లనే నవర్లు సంగపోళ్ళు అని వ్యవహరిస్తారు.

"అయితే గురువా! మేము సావుకారి కాడ డబ్బువోడీసినాం కదా? సావుకారి ఊరుకుంటాదేమిటి?"

"మీరు మీ సరుకుల్ని గోదాములో అమ్మి, సావుకారి వద్ద వాడిన డబ్బులు తీర్చెయ్యండి."

"అలగేని గురువా! నువ్వు సెప్పినట్టే పేస్తామ్."

వలస దగ్గర పడింది. పిల్లలు పరుగులు తీస్తూ ఎదురు వచ్చి పోతు లెక్కారు. మీటింగు వేదికకు అలంక రించిన రంగు రంగుల ముచ్చికాగితాలను నవర్లు సేకరించి వాటిని పిల్లల కిస్తు న్నారు. ఆధునిక యుగంలో చదువు అవసరాన్ని గుర్తించి, పని, పాటల్లో సాయంచేయగల పిల్లలను సహితం బడికి పంపుతున్నారు. రోజుకి నాలుగు సార్లు బడిగంట మోగుతూనే ఉంది.

మామిళ్ళు పూతకొచ్చాయి. చింతలు పండి బొట్టకొచ్చాయి. చీకటితో అడవికి పోయి చింతబొట్టలేరుకొని చీకటి పడు తుండగా వలస కొస్తున్నారు నవర్లు. ఇప్పుడు వలసల్లో సావుకార్లకు బదులు, కార్పొరేషన్ మనుషులు కనిపిస్తున్నారు. క్రిందటి శనివారం నాలుగు రోజులు శెలవుపెట్టి మా స్వంత ఊరెళ్ళి వచ్చాను.

"ఒరే ఉమా! అదసలే నక్సలైట్ ఏరియా. కొంచెం జాగ్రత్తగా ఉండు బాబు," అంటూ జాగ్రత్తలు చెప్పి బస్సు ఎక్కించారు "ఒరే ఉమా మీ నవర వలసలో చింతపండు చవకటకదా! ఈసారి వచ్చేటప్పుడు తప్పకుండా తీసుకుర"మ్మని చెప్పింది అమ్మ. బస్సు దిగేటప్పటికి సాయంత్రం మూడుగంటలైంది. విరగ కాసిన చింతచెట్లను చూస్తూ, పిట్టల అరుపులను వింటూ ఎర్రమట్టి రోడ్డుమీద నడుస్తున్నాను. అప్పటికీ, ఇప్పటికీ ఎర్రమట్టి రోడ్డు ఏమీ మారలేదు, నవర్ల జీవితాల లాగే. మేష్టిగారొచ్చేశారు, మేష్టిగారొచ్చేశారు. అనుకుంటూ, పోతులను మేపుతున్న పిల్లలు వచ్చి బ్యాగ్ అందుకున్నారు. తలుపు తెరచి పాకలో అడుగుపెట్టగానే ఒక కాగితం కనిపించింది. దాన్ని తీసి చదివాను. దాని సారాంశ మేమిటంటే.

"చీకటి బ్రతుకులకు వెలుగు నివ్వా లని ఎర్రగా వెలుగుతుంది జ్యోతి. బ్రతికిన నాలుగు క్షణాలైనా వెలుగులో బ్రతకాలని, వెలుగుచుట్టూ మూగి సెగలో శరీరాల్ని మాడ్చి, ఆ చమురుతో ఆరిపోతున్న జ్యోతిని వెలిగించి, ముందు తరాలకు సందేశా న్నిచ్చాయి చీకటి పురుగులు. అనుక్షణం పొంచి ఉన్న బల్లులకు ఐడుస్తూ, చీకటిలో బ్రతుకు తున్న చీకటి పురుగుల్లారా! రండి. మీరు మీ ముందు తరాలకు వెలుగు నివ్వడం

కోసం జ్యోతికి సమిదలు కండి. వీర స్వర్గాన్నలరించండి." కాగితాన్ని నా డైరీలో భద్రపరచాను. ఆ రాత్రి వంట చేసుకోవడానికి బద్ధకమనిపించి అమ్మ చేసి యిచ్చిన లడ్డూలు రెండు తిని పడుకున్నాను. నిద్రపట్టడం లేదు. ఈ మధ్య నాకూ సంబంధాలొస్తున్నాయట, అమ్మ చెప్పింది. మంచి సంబంధం చూసి పెళ్ళి చేసెయ్యాలని తొందర పడుతోంది అమ్మ. నిద్రపట్టక ఏదేదో ఆలోచిస్తూ పడుకున్న నాకు బయట లీలగా మాటలు వినిపించాయి. తలుపు తెరిచి చూచాను. బయట చీకటిగా ఉంది. వలస మధ్యలో కాగడా వెలుగుతోంది. సవరలు వెలుగుచుట్టూ చేరిన చీకటి పురుగుల్లా కాగడా చుట్టూ కూర్చుని, తమ బాధలను చెప్పుకుంటున్నారు సంఘపెద్దలతో.

"బాబూ కొండమీద తుప్పా, డొంకా కొట్టి పోడుచేస్తే, సెట్లు నరికేస్తున్నారని ఫారెష్టోడు మా సవర్లని సర్వీసెట్లు నాటించడానికి ఎట్టికి తోలుకెల్లినాడు. కొండ కొట్టకా, కొండకింద గుడ్డి మొక్కలు సేసుకోనియ్యకా ముసిలి బక్కలిచ్చారు ఎందుకు బావు? కొట్టుకు తినడానికా? కట్టి మేపడానికా?" అంతా విని తలలూపారు సంఘపెద్దలు.

"బాబు. సింతపండు గోదాముకు తీసుకెళ్ళి అమ్ముతున్నారు. సావుకారి అజ్ఞానకావిడి ముప్పయి రూపాయలిస్తామన్నాడు దార్ల. సొసైటీ కొట్టుకె 23 రూపాయలిచ్చినారు తూసి. ఇదేటి మరి నాయం."

"సొసైటీలో మిమ్మల్ని మోసం చేస్తున్నారని నమ్మించడానికి సావుకార్లు కావిడికి పదేసి రూపాయల చొప్పున రేటు పెంచి అడిగి వదిలేస్తారు గాని కొనరు. ఇకనుంచి సావుకార్లు దారికాసి ఎంత ఇస్తామన్నా సరుకు గోదాములోనే అమ్మండి" అని చెప్పారు సంఘపెద్దలు. కేజీ 75 పైసలకు గోదాముకు చేరిన చింతపండు ప్రజల చేతి కొచ్చేసరికి మాత్రం ఏడురూపాయ లెందుకౌతుందో అర్థంకావడం లేదు ప్రజలకు. సవర్లవద్ద కొన్న సరుకు సగంమాత్రం ఎకౌంటులో పడి, మిగతాది సావుకార్ల ఇళ్ళకు చేరుతుందనే సత్యం కార్పొరేషన్ లారీ డ్రైవరుకు తప్ప తెలియదు. సావుకార్ల కబంధహస్తాలనుంచి సవర్లను కాపాడవలసిన కార్పొరేషన్‌లు సవర గూడేలంట తిరిగి ఖరీదుచేసే చిన్న చిన్న వ్యాపారస్తుల కడుపులు కొట్టి బడాసేఠ్‌ల బొజ్జలు పెంచుతుంది నేరుగా.

"మీరు అడుగడుగునా మోసగించబడుతున్నారు. ప్రతిక్షణం మోసపోతూ బ్రతికే బ్రతుకు కంటే చావడమే మేలన్నారు సంఘపెద్దలు. ఇంకేదేదో చెప్పారు ఏమేమో చేయమన్నారు. వాళ్ల చెప్పింది వీళ్ళర్థం చేసుకునేలోగా

"మాతో రండని" చెప్పి లేచి నిలబడ్డారు 'సంఘపోళ్ళు'. ఎక్కడికి అని పీళ్ళడగలేదు. ఫలాని దగ్గరికని వాళ్లూ చెప్పలేదు. కాగడా కదిలింది. అనుసరించారు సవర్లు. కోళ్ళు స్వాగతం చెప్తుండగా వలసలో అడుగుపెట్టారు సవర్లు బుజాలమీద మూటలతో. వెలుగొచ్చి కొండ తెల్లబారింది పోలీస్ వ్యాన్ రాకతో. ధాన్యంమూటలసాక్ష్యంతో సవర్లు చీకటి కొట్లోకి తరలించబడ్డారు. దొంకవలస సొందోడ్ని చంపి, సొండి దాని సొమ్ములు, సొందోడు చెమటను సారాగా మార్చి కూడబెట్టిన డబ్బు, సంఘపెద్దల చేతుల్లో కెళ్ళిందన్న సంగతి సవర్లకు పోలీస్‌స్టేషన్‌లోనే తెలిసింది. వాళ్ళకు తెలిసిదంతా సొండోడి గాదిలోని ధాన్యన్ని సంఘపోళ్ళు మూటలు కట్టుకోమన్నారు. మేం కట్టుకున్నాం. అంతకంటే మాకేమీ తెలియదన్నారు స్టేషన్లో. వలసలో రాత్రులు పోలీసు రైడ్ అధికమయింది. కోళ్ళు, మేకలు మాయమవుతుంటే కొండకి పులి దిగిందేమో! అనుకుంటున్నారు ఆడవాళ్ళు, పిల్లలు, వలసలోనున్న ముసలీ ముతకా, రోజులు గడుస్తున్నాయి. పొయ్యిలమీద కెక్కే కుండం సంఖ్యా తగ్గుతుంది. ఆడవాళ్ళు కర్రలు కొట్టి, నాలుగు మైళ్ళు వాటిని తీసుకుపోయి పట్నంలో అమ్మి, నూకలు తెచ్చి కుండలు కడుతున్నారు. బడిపిల్లలు బడిగంట కొట్టడానికి ఘర్షణపడటంలేదు. అసలు బడి మొగమే చూడటంలేదు ముఖాల్లో భయం, కడుపులో ఆకలి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. అడవి లోపలకు పోతున్నారు వాళ్ళు అడవిలో దొరికే దుంపలు ఏరుకోవడానికి. మామిడి టెంకలు ఏరి, వాటిని గెడ్డలో నానబెడుతున్నారు. జీడిని వేరుచేసి ఆ జీడి పిండితో అంబలి వండుకోడానికి వాటిని సిద్ధం చేస్తున్నారు. వంటరిగా అడవిలో కనిపించే ఆడదాని శీలం కాకీబట్టల కింద కవికిపోతుంది. బడిలో వండించిన అల్పాహారం కోసం వలసలో ఉండిపోతున్న ముసలివాళ్లు వచ్చి తీసుకువెళుతున్నారు. వెన్నునంటే ఆకలి తీరి, పిల్లల మొఖాల్లో చిరునవ్వులు వెలిగేదెప్పుడో? ఈ బడిగంట మ్రోగేదెప్పుడో?

బడిగంట కొట్టడానికి పోటీపడే విద్యార్థుల కోసం, బడిలో అల్పాహారం వండించి, భక్తులకోసం ఎదురు చూసే పూజారిలాంటి సవరవలస టీచరు పోలీసులకు ఏజెంట్ గా పనిచేస్తున్నాడనే అనుమానంతో సంఘపోళ్ళ చేతుల్లో చంపబడ్డా, అతని ఆత్మమాత్రం బడి చుట్టూ తిరుగుతూనే ఉంది. పిల్లలు అల్పాహారానికి కూడా దూరమైపోయారే అనే బాధతో, వీళ్ళు కూడా బాలల సంవత్సరాలు జరుపుకొంటారనే ఆశతో.